క్లుప్తంగా

వైభవంగా ఉరుసు



ప్రార్థనలు చేస్తున్న స్వామి వారసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గావీధిలో వెలసిన హుసేన్ పీర్ దర్గా 199వ ఉరుసు మహోత్సవాలు స్వామి వారసులు సయ్యద్ మహమ్మద్ కరిముల్లా హుస్సేన్‌షా ఖాదిరి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. మత సామరస్యానికి ప్రతీకగా జరిగే ఈ ఉరుసు కార్యక్రమానికి బద్వేలు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన హిందూ, ముస్లింలు అ. ధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. మొక్కుబడి ఉన్న భక్తులు దర్గా ఆవరణలో అన్నదానం నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. గురువారం తెల్లవారుజామున స్వామి వారికి గంధం ఎక్కించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్వామి వారసులు దర్గారహమతుల్లా, దర్గాము న్వర్, దర్గాషఫివుల్లా, దర్గాసలీం, ఆర్గనైజర్లు అన్వర్‌బాషా, షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంపీడీఓ కోటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వద్ద భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల వాతావరణ పరిస్థితులు చాలా బాగున్నాయని, పాఠశాల అభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం అభినందనీయమని కొనియాడారు.

ఉచిత అంబులెన్స్ ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జిన్నా రోడ్డులోని జమా అతె ఇస్లామి హింద్ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత అంబులెన్స్‌ను మున్సిపల్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమా అతె ఇస్లామి హింద్ ప్రొద్దుటూరు శాఖ సంఘ సేవా విభాగం ఆధ్వర్యంలో ఉచితంగా అంబులెన్స్ సౌకర్యం కల్పించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జమా అతె ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్ అహ్మద్, జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర సలహామండలి సభ్యుడు ఎస్ఎస్ మొహిద్దీన్, పట్టణ అధ్యక్షుడు షఫివుల్లా, షరీఫ్, ప్రధాన కార్యదర్శి రహమతుల్లా పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు

మైదుకూరు : ట్రైకోడెర్మావిరిడి శిలీంద్రంతో పంటలను ఆశించే తెగుళ్లను అరికట్టవచ్చని మైదుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి, మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో బుధవారం ట్రైకోడెర్మావిరిడి తయారీ, దాని ఉపయోగాలపై రైతులకు అవగాహన నిర్వహించారు. ట్రైకోడెర్మావిరిడి అనేది ఒక జీవశిలీంద్రమని, పంటలను ఆశించే తెగుళ్లను ఇది అరికడుతుందని వారు పేర్కొన్నారు. విత్తన శుద్ధికి ఒక కేజీ విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడిని కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ శిలీంద్రాన్ని భూమిలో 90 కిలోల మాగిన పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి, నాలుగు కిలోల ట్రైకోడెర్మావిరివిడిని బాగా మిశ్రమం చేసి నీడలో కుప్పగా పోసి గోనెసంచిలో కప్పి నీటిని చిలకరిస్తూ ఉండాలని తెలిపారు. 10 నుండి 15 రోజుల తర్వాత ఈ మిశ్రమంలో విత్తే ముందు వెదజల్లి దున్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పసుపు సాగు వైపు.. అన్నదాతల చూపు

మైదుకూరు నియోజకవర్గంలో పలువురు రైతులు పసుపు సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. వచ్చే ఏడాది అధిక ధర పలుకుతుందని ఆశల సాగు చేస్తున్నారు అన్నదాతలు. ఏయేటికి ఆ యేడు సాగు ఖర్చులు పెరుగుతున్నప్పటికీ పసుపు సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. రైతు కుటుంబాలు పసుపు పంటను ఇంటి పంటగా, లక్ష్మీ పంటగా భావిస్తూ.. పచ్చబంగారాన్ని సాగు చేయడానికి ఇష్టపడుతున్నారు.

- ఊరిస్తున్న పసుపు.. ఆసక్తిగా సాగు చేస్తున్న రైతులు
- సాగుకు పెరిగిన పెట్టుబడులు
- గతేడాదికి మంచి పెరిగిన సాగు విస్తీర్ణం



చాపాడు : ఈ ఏడాది కాకుంటే వచ్చే ఏడాదైనా ధరలు బాగుంటాయని ఆశించి పసుపు సాగు చేయటంపై రైతులు ఆసక్తి చూపిస్తుంటారు. అయితే గత మూడేళ్లుగా ఏడాదికేడాది పసుపు ధరలు పెరుగుతుండటంతో వచ్చే ఏడాది మరింత మంచి ధరలు ఉంటాయనే ఆశాభావంతో మైదుకూరు నియోజకవర్గంలో రైతులు పసుపు సాగు చేస్తున్నారు. గతేడాది క్వింటాల్ వట్టి పసుపు ధర రూ.16 వేలు వరకూ రావటంతో పసుపు సాగు చేసి రైతులందరూ సంతృప్తి చెందారు. ఈ ఏడాది కూడా ధరలు ఉంటాయనే ఆశాభావంతో నియోజకవర్గ వ్యాప్తంగా పసుపు సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాగు ఖర్చు ప్రతి ఏటా పెరుగుతున్నప్పటికీ రైతులు మాత్రం సాగుపై దృష్టి సారిస్తున్నారు.

2,670 ఎకరాల్లో పసుపు సాగు

మైదుకూరు నియోజకవర్గంలో మైదుకూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం మండలాల్లో ఈ ఏడాది పసుపు సాగును రైతులు ఆసక్తిగా సాగు చేస్తున్నారు. గతేడాది 1,940 ఎకరాల్లో పసుపు సాగు కాగా ఈ జూన్, జూలై మాసాల్లో 2,670 ఎకరాల్లో రైతులు పసుపు సాగు చేసినట్లు అధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి. నియోజకవర్గంలో అత్యధికంగా మైదుకూరు మండలంలో సాగు కాగా, అత్యల్పంగా బ్రహ్మంగారిమఠం మండలంలో పసుపు సాగు అవుతోంది.

సాగు ఖర్చు పెరిగినా..
గిట్టుబాటు ధరలు ఉంటాయనీ..

గత ఏడాది కంటే ఈ ఏడాది సాగు ఖర్చు పెరిగినప్పటికీ పసుపు సాగు చేయటంపై రైతులు దృష్టి సారించారు. గతేడాది ఎకరా సాగుకు రూ.1.30 లక్షలు పైగా ఖర్చు కాగా.. ఈ ఏడాది పెరిగిన సాగు ఖర్చులు ఎకరాకు రూ.1.50 లక్షలు అవుతుందని రైతులు అంటున్నారు. ఎకరాకు సాగు చేసేందుకు విత్తన పసుపు పుట్టి రూ.12 వేలు ఉండగా ఎకరాకు 5 పుట్ల విత్తనం అవసరం అవుతోంది. గతేడాది వట్టి పసుపు క్వింటాల్ రూ.14 వేలు నుంచి రూ.16 వేలు వరకూ ఉండగా ఈ ప్రస్తుతం రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకూ ఉంది. పంట పూర్తయ్యాక గతేడాది కంటే ధర పెరుగుతుందనే ఆశాభావంతో పసుపు సాగు చేస్తున్నామని రైతులు తెలుపుతున్నారు.

నియోజకవర్గంలో పసుపు సాగు వివరాలు

మండలం	గతేడాది సాగు (ఎకరాల్లో)	ఈ ఏడాది సాగు (ఎకరాల్లో)
మైదుకూరు	950	1400
చాపాడు	150	200
దువ్వూరు	350	490
ఖాజీపేట	430	500
బ్రహ్మంగారిమఠం	60	80
మొత్తం	1940	2670

రెండెకరాల్లో పసుపు సాగు



గతేడాది ఎకరాలో పసుపు సాగు వేశాను. ఈ ఏడాది రెండెకరాల్లో సాగు చేస్తున్నాను. గతేడాది కంటే ఈ ఏడాది ఖర్చు పెరిగింది. ఎకరాకు రూ.1.50 లక్షలు పైగా అవుతోంది. గతేడాది మాదిరి ఈ ఏడాది కూడా మంచి ధరలు ఉంటాయనే ఆశాభావంతో రెండు ఎకరాల్లో పసుపు సాగు చేశాను. ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుని రైతులకు గిట్టుబాటు అయ్యే విధంగా పసుపు ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. సాగు కోసం ఎరువులు, పురుగు మందులు, సాగు ఖర్చులు ప్రతి ఏటా పెరుగుతున్నాయి.

- వర్రా రమణారెడ్డి, రైతు, సీతారామాపురం, చాపాడు మండలం

పాఠశాలలను తనిఖీ చేసిన జెడ్పీటీసీ

పోరుమామిళ్ల : మండలంలోని గానుగపెంట సచివాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొట్టాలపల్లె, ఎనమల నాగాయపల్లె ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సిఎం బాషా, రాజశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్, కొందరు ఉపాధ్యాయులు, సమయ పాలన పాటించడం లేదని గమనించారు. సమయ పాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచ్ వీరభద్రుడు, సింగల్‌విండో అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మైదుకూరు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా వైద్యాధికారులకు సూచించారు. బుధవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి వైద్యాధికారులతో మాట్లాడుతూ డయేరియా నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో డయేరియాకు గురి అయిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. జ్వరాలు, దగ్గు, జలుబు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట ఏఈ విశ్వకిరీటి ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం ఉండవచ్చని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, సరస్వతీ విద్యామందిర్‌లో బుధవారం సీజనల్ వ్యాధులు, స్టాప్ డయేరియాలపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో నీరు నిలబడకుండా చూసి దోమలను వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. డయేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు తదితర వ్యాధులు పట్ల జాగ్రత్త వహించాలన్నారు. డాక్టర్ బి.శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఆలీమ్, ప్రధానోపాధ్యాయులు గురప్ప, శ్రీనివాసులు, డీపీఎం శివశంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన వైద్యాధికారులు



ఆస్పత్రిలో రికార్డులు, సిబ్బంది పనితీరుపై మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ

అట్లూరు : అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.రవికుమార్, జిల్లా వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని సిబ్బంది పనితీరు, రికార్డుల పరిశీలన అనంతరం అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠువ్యాధి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. శరీరంపై తెల్లటి, రాగి రంగు మచ్చలు రావడం, ఆ ప్రదేశంలో స్పర్శ తెలియకపోవడం, కాలి, చేతి వేళ్లు తిమ్మిరులుగా ఉండడం వంటి లక్షణాలు ఉంటే స్థానిక వైద్యాధికారిని సంప్రదించాలని తెలిపారు. స్థానిక వైద్యాధికారులు డాక్టర్ హమీదాబేగం, డాక్టర్ మాధురి, ఫిజియోథెరపిస్టు విక్టర్ మనోహర్, డీపీఎంఓ లక్ష్మీనారాయణ, సీహెచ్ఓ మురళీకృష్ణ, సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల : గుర్తింపులేని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరపోగు రవి అధికారులను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, పుస్తకాలకు వేలాది రూపాయలు దండు కుంటున్నాయని ఆరోపించారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : నిబంధనలను పాటించని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని నేషనల్ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ బుధవారం స్థానిక ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యాసంస్థలు టెక్స్‌బుక్స్, నోట్‌బుక్స్, విద్యాసామాగ్రిని విక్రయించి వేల రూపాయలు తల్లిదండ్రుల నుంచి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులు విచారణ చేసి ఈ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌డీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉపేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చాపాడు : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని మండల విద్యాధికారి రవిశంకర్ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం క్రీడా దినోత్సవంలో భాగంగా శిక్షా సప్తాహ‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, ఉప్పాట, బొంగరాలు, గోలీలు వంటి గ్రామీణ క్రీడలను విద్యార్థులు ఎన్నటికీ మరవకూడదని సూచించారు. గ్రామీణ క్రీడల వలన విద్యార్థుల్లో ఉత్తేజితం పెరిగి చదువులో రాణిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి ఎంఈఓ-1 రవిశంకర్, ఎంఈఓ -2 వంశీకృష్ణ క్రీడలను ఆడారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ప్రత్యేకాధికారి నాగలక్షుమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థినులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యంతో చదవాలని ప్రముఖ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు అభిషేక్ సింగం శెట్టి తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దశెట్టిపల్లెలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ, కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

జీఓ 117 రద్దుచేయాలి

పోరుమామిళ్ల : తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే వర్తింపచేయాలని, జీఓ 117 రద్దుచేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్ఎ సత్తార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగుల ఐఆర్ ప్రకటించాలని, రెండు సంవత్సరాలుగా బకాయిలో ఉన్న ఆర్జిత సెలవు బకాయిలను, పీఎఫ్‌లోన్ బకాయిలు చెల్లించాలని కోరారు. పాఠశాల విద్యుత్ బకాయిలు ప్రభుత్వమే చెల్లించాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని సత్తార్ డిమాండ్ చేశారు. మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు వెంకట్రామిరెడ్డి, రామభూపాలరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అన్వర్‌బాషా, సుబ్బయ్య, సీతారామిరెడ్డి, గురివిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పోష్ చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ నిర్మల

బద్వేలు అర్బన్ : పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నిరోధానికి 2013లో అమల్లోకి వచ్చిన పీఓఎస్‌హెచ్ (పోష్) చట్టాన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో నిష్పక్షపాతంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, ఐసీడీఎస్ సీపీడీఓ ఎం.శ్రీదేవి పేర్కొన్నారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపులు ఎదుర్కొనే మహిళలు పోష్ యాక్ట్ కింద ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

కాశినాయన : మహిళలు, పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నివారించాలంటే 2013లో అమల్లోకి వచ్చిన పోష్ చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీపీడీఓ లక్ష్మీదేవి, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసన్న, ఎంఈఓ నిర్మల పేర్కొన్నారు. బుధవారం నరసాపురం స్త్రీశక్తి భవనంలో పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోష్ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎస్ఐ కాశయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

రాజుపాళెం : రాజుపాళెం గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.ప్రతాపుడు, పాఠకులు వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రతాపుడు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి వెంకటరమణయ్య ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన పుట్టిన రోజు జరుపుకోవడం ఎంతో గర్వకారణమని చెప్పారు.

అట్లూరు : గ్రంథాలయ ఉద్యమకారుడుఅయ్యంకి వెంకటరమణయ్య జయంతిని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు పండితుడు గౌరీశంకర్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో బుధవారం అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి కడప జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, రిటైర్డు హెడ్మాస్టర్ రాజశేఖర్ రాజు నివాళి అర్పించారు. విశ్రాంత అసిస్టెంట్ ఇంజనీర్ కొండయ్య, రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, రవిబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే కీలకం

రాజుపాళెం : మంచి మార్గంలో పయనించే విధంగా పిల్లల భవిష్యత్తుకు పాటుపడుతున్న ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని ప్రొద్దుటూరు రూరల్ సీఐ రమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్రపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు గురించి నిరంతరం ఆలోచిస్తూ ఉంటారని, వారు చెప్పే విద్యాబుద్ధులు, పాఠ్యాంశాలను శ్రద్ధగా విని అవగాహన చేసుకోవాలన్నారు. బాల్యం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులంతా బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు.